సాక్షి శ్రీకాకుళం

ఆదివారం । 21 । సెప్టెంబర్ । 2025



అడవి కొత్తూరు పాఠశాలలో..

కొత్తూరు: అడవికొత్తూరు మండల పరిషత్ మోడల్ పాఠశాలలో శనివారం ముందస్తు దసరా సంబరాలు నిర్వహించారు. పిల్లలు ఇంటింటికీ వెళ్లి పాటలు పాడారు.



శ్రీముఖలింగంలో..

జలుమూరు: శ్రీముఖలింగంలోని వారాహి అమ్మవారికి శరన్నవరాత్రుల్లో ప్రత్యేక పూజలు చేయనున్నట్లు ఈఓ టి.వాసుదేవరావు తెలిపారు. ప్రత్యేక అలంకరణలు కూడా చేస్తామని పేర్కొన్నారు.



దసరా సరదా

ఇచ్ఛాపురం రూరల్: ఎ.బలరాంపురం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు శనివారం ముందస్తు దసరా సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నవదుర్గలు, మహిషాసురమర్ధని, అమ్మవారు, రాక్షసుల రూపాల్లో అలరించారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల నియామకం



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీల్లో జిల్లాకు చెందిన పలువురిని నియమిస్తూ శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర మున్సిపల్ వింగ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పలాస నియోజకవర్గానికి చెందిన బడగల బాలచంద్రుడు, దివ్యాంగుల విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నరసన్నపేట నియోజకవర్గం నుంచి బాన్న రాము, వైఎస్సార్ టీయూసీ సంయుక్త కార్యదర్శిగా నరసన్నపేట నియోజకవర్గానికి చెందిన కొబగాపు నాగరాజు, సోషల్ మీడియా వింగ్ సంయుక్త కార్యదర్శులుగా ఆమదాలవలస నియోజకవర్గానికి చెందిన బొడ్డేపల్లి వెంకటసత్యం, నరసన్నపేట నియోజకవర్గానికి చెందిన కనపల అరవింద్‌నాయుడుని నియమించారు.

వసప కేజీబీవీలో అదనపు బియ్యం సీజ్



గోనె సంచుల మధ్య దాచి ఉంచిన బియ్యం బస్తాలు

కొత్తూరు: వసప గ్రామం వద్ద ఉన్న కేజీబీవీలో అదనంగా ఉన్న 1150 కిలోల బియ్యంను స్థానిక తహసీల్దార్ కె.బాలకృష్ణ శనివారం సీజ్ చేశారు. కేజీబీవీని తహసీల్దార్ శనివారం తనిఖీ చేశారు. కేజీబీవీ ఎస్ఓ రాధిక అందించిన రికార్డులతో పాటు సిబ్బంది హాజరు పుస్తకాలను నిశితంగా పరిశీలించారు. రికార్డుల ప్రకారం 248 కిలోల బియ్యం ఉండాల్సి ఉండగా.. అదనంగా మరో 1150 కిలోల బియ్యం ఉన్నట్లు తహసీల్దార్ గుర్తించారు. వీటిని సంచులు కప్పి గోప్యంగా ఉంచారు. సీజ్ చేసిన బియ్యంలో 300 కిలోలు బియ్యం హాస్టల్‌కు వెనుక భాగంలో ప్రహరీకి, హాస్టల్‌కు మధ్యన ఉండడం గమనార్హం. ఈ బియ్యం పూర్తిగా తడిసి పాడైపోయిందని తహసీల్దార్ తెలిపారు. అదనపు బియ్యంపై సమగ్ర సర్వ శిక్ష అభియాన్ ఏపీసీకి నివేదిక అందించామన్నారు. కేజీబీవీ ఎస్ఓపై ఇప్పటికే అనేక ఫిర్యాదులు ఉన్నాయి.

ఎవరి మెడకు చుట్టుకుంటుందో..!



- శ్రీముఖలింగం అర్చకుడిపై దాడి.. కేసు రిజిస్టర్ చేసిన జాతీయ మానవ హక్కుల కమిషన్
- బాధితుడికి మెయిల్ పంపించిన ఎన్‌హెచ్ఆర్సీ
- హక్కులకు భంగం కలిగిందని నిర్ధారణ

రంగంలోకి ఎన్‌హెచ్ఆర్సీ

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

జిల్లాలో ఎక్కడో ఓ మారుమూల జరిగిన ఘటనపై ఏకంగా జాతీయ మానవ హక్కుల కమిషన్ కేసు రిజిస్టర్ చేసింది. అధికార దర్పంతో సామాన్యుడి హక్కులకు భంగం కలిగిస్తే చూస్తూ ఊరుకోబోమని చెబుతూ తానే స్వయంగా రంగంలోకి దిగింది. శ్రీముఖలింగం ఆలయ అర్చకుడు నాయుడిగారి రాజశేఖర్‌పై ఇటీవల దాడి జరిగింది. తనపై ఎనిమిది మంది హత్యాయత్నానికి పాల్పడ్డారని, స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఒత్తిళ్లతో పోలీసులు చిన్న సెక్షన్లు పెట్టి కేసు మమ అనిపించేశారని ఆయన ఏకంగా జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన కమిషన్ హక్కులకు భంగం కలుగుతోందని నిర్ధారణకు వచ్చి కేసు నంబర్ 1866/1/20/2025ను రిజిస్టర్ చేసింది. ఈ మేరకు ఫిర్యాది నాయుడిగారి రాజశేఖర్‌కి ఈ మెయిల్ వచ్చింది. జాతీయ మానవ హక్కుల కమిషన్ అధికారులే నేరుగా తమదైన శైలిలో విచారణ జరిపి, ఆదేశాలు ఇవ్వనున్నారు.



జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన నాయుడిగారి రాజశేఖర్ (ఫైల్)

ఇదీ విషయం

శ్రీముఖలింగం కరకట్టపై సుమారు రూ.కోటి ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపడుతున్న పనుల డొల్లతనాన్ని శ్రీముఖలింగం ఆలయ అర్చకుడు నాయుడిగారి రాజశేఖర్ బయటపెట్టారు. అంతటితో ఆగకుండా ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డులో అవినీతి జరిగిందని, రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించలేదని గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ అంశాలపై అక్కసుతో జూలై 10న ఎనిమిది మంది కర్రలు, రాళ్లతో ఆయనపై దాడి చేసి, హత్యాయత్నానికి ఒడిగట్టారు. ఘటనపై రాజశేఖర్ జూలైలో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే స్థానిక ఎమ్మెల్యే ఒత్తిడితో చిన్న సెక్షన్లతో కేసు నమోదు చేశారని రాజశేఖర్ ఆరోపించడమే కాకుండా ఢిల్లీ వెళ్లి రాష్ట్రపతికి, జాతీయ మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేశారు. తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని కోరారు. విచిత్రమేమిటంటే 2018 మార్చిలో నలుగురు తనపై దాడి చేశారని, అప్పుడు కూడా పోలీసులు చర్యలు తీసుకోలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. గమనించాల్సిన అంశం ఏమిటంటే ఎమ్మెల్యేగా బగ్గు రమణమూర్తి ఉన్న కాలంలోనే రెండు పర్యాయాలు రాజశేఖర్‌పై దాడి జరిగింది.

వాస్తవంగా జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఎన్నో ఫిర్యాదులు వెళ్తుంటాయి. అన్నీ విచారణకు తీసుకునే అవకాశం ఉండదు. మానవ హక్కులకు భంగం కలిగిందని నిర్ధారణ అయితేనే ఫిర్యాదులపై కేసు రిజిస్టర్ చేస్తారు. నాయుడిగారి రాజశేఖర్‌పై జరిగిన దాడిని కూడా మానవ హక్కులకు భంగం వాటిల్లినట్టుగా భావించి కేసు రిజిస్టర్ ఉండొచ్చని సంబంధిత వర్గాలు భావిస్తున్నాయి. కేసు రిజిస్టర్ కావడంతో జరిగిన ఘటనపై విచారణ జరగనుంది. ప్రతివాదులకు నోటీసులు పంపించి, నేరుగా విచారణ జరిపే అవకాశం ఉంటుంది. అది ఇక్కడైనా కావొచ్చు. ఢిల్లీలోనైనా జరగొచ్చు. ఇది చివరకు ఎవరి మెడకు చుట్టుకుంటుందో చూడాలి.

కేజీబీవీలో అర్ధరాత్రి అలజడి

- రెండంతస్తుల భవనంపై నుంచి పడి గాయపడిన విద్యార్థి
- లోలుగు కేజీబీవీలో ఘటన



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని

పొందూరు: అర్ధరాత్రి సమయం.. విద్యార్థులంతా ఆదమరిచి నిద్రపోతున్న వేళ.. అంతా ఉలిక్కిపడేలా పెద్ద శబ్దం.. వచ్చి చూస్తే ఓ విద్యార్థిని రక్తమోడుతూ కనిపించింది. హుటాహుటిన ఆస్పత్రికి తీసుకెళ్తే విద్యార్థిని రెండు కాళ్లు విరిగిపోయాయి. వెన్నెముకకు తీవ్రమైన గాయమైంది. పొందూరు మండలం లోలుగు కేజీబీవీలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన ఘటన ఇది. వివరాల్లోకి వెళితే..

కేజీబీవీ పాఠశాలకు చెందిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని సీహెచ్ వందన అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో రెండతస్తుల భవనంపై నుంచి పడిపోయింది. పెద్ద శబ్దం కావడంతో సిబ్బంది, విద్యార్థులు లేచి చూసేసరికి తీవ్రంగా గాయాలపాలై కింద పడిపోయి ఉన్న విద్యార్థిని కనిపించింది. వెంటనే విధుల్లో ఉన్న వ్యాయామ ఉపాధ్యాయురాలు రూపవతి, అకౌంటెంట్ నాంచారమ్మలు ప్రిన్సిపాల్ ఎస్.లలితకుమారికి సమాచారం ఇచ్చారు. అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో అందులో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. విద్యార్థిని కాళ్లు రెండూ విరిగిపోవడంతో పాటు వెన్నుపూస కూడా గాయమైనట్లు సమాచారం. ఘటనపై ఎస్ఐ సత్యనారాయణ ఉపాధ్యాయినులు, సిబ్బంది, విద్యార్థినులతో మాట్లాడారు. పోలీసులకు వచ్చిన ఫిర్యాదు మేరకు పొందూరు ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేశారు. కొన్ని రోజులుగా స్థానిక కేజీబీవీ అనేక విషయాల్లో వివాదాస్పదమవుతుండడంతో అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయినులు, సిబ్బంది, విద్యార్థినులు, తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనలు చెందుతున్నారు. ఎంఈఓ-1 వాగ్దేవికి సమాచారం ఇవ్వడంతో ఆమె శ్రీకాకుళం రిమ్స్‌కు వెళ్లి వివరాలు సేకరించారు.



కేజీబీవీలో పోలీసుల పరిశీలన

బ్రహ్మోత్సవాల్లో ప్రసంగానికి రాజారావుకి ఆహ్వానం

పొందూరు: మండలానికి చెందిన రచయిత, రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కార అవార్డు గ్రహీత వావిలపల్లి రాజారావుకు అరుదైన గౌరవం దక్కింది. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించనున్న భక్తి సందేశం కార్యక్రమంలో ప్రసంగించేందుకు టీటీడీ ఆహ్వానం పంపింది. ఈ నెల 30వ తేదీన తిరుమలలోని ఆస్థాన మండపంలో అన్నమయ్య కీర్తనలపై ప్రసంగం ఉంటుంది.

వంశధారలో మునిగి ప్రధానోపాధ్యాయుడు మృతి



వంశధార నది ఒడ్డున సంఘటన స్థలం వద్ద ఉన్న గ్రామస్తులు



నాగేశ్వరరావు (ఫైల్)

నరసన్నపేట: గోపాలపెంట ప్రాథమిక పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న మార్పు నాగేశ్వరరావు (54) ప్రమాదవశాత్తూ వంశధారలో మునిగి మృతి చెందారు. ఇదే గ్రామంలో నాగేశ్వరరావు నివసిస్తుండగా కొద్ది రోజులుగా అనారోగ్యంగా ఉన్నట్లు సమాచారం. శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో వంశధార నదికి స్నానానికి వెళ్లిన ఆయన ఎంతకూ తిరిగి రాలేదు. దీంతో భార్య రమణమ్మ, కుమారులు సునీల్, సుధీర్‌లు కుటుంబ సభ్యులు, స్థానికుల సహకారంతో పరిసరాల్లో గాలించారు. అయినా ఆచూకీ లభించలేదు. రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం ఉదయానికి ఒక చోట ఆయన వస్త్రాలు, చెప్పులు కనిపించడంతో ప్రమాదవశాత్తూ నీట మునిగి ఉంటారని అనుమానించి ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి గాలించగా నదిలో నీరు అధికంగా ఉన్న ఒక చోట మృతదేహాన్ని శనివారం సాయంత్రం గుర్తించారు. దీంతో ఒక్కసారి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. ఆయన ఇక్కడ మూడేళ్లుగా పనిచేస్తున్నారు. విషయం తెలుసుకుని గ్రామస్తులు కూడా కంట నీరు పెట్టారు. నాగేశ్వరరావు మృతిపై సర్పంచ్ ఎండ కృష్ణవేణి, ఎంపీటీసీ గదిలి మల్లేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు బొబ్బాది ఈశ్వరరావు, తోట భార్గవ్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. ఘటనపై నరసన్నపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బ్లేడు గాడు దొరికాడు

- ఇద్దరు గజ దొంగలను పట్టుకున్న పోలీసులు
- వీరిపై 68 కేసులు
- పోలీసులను ముప్పతిప్పలు పెట్టడం వీరి నైజం
- నిందితుల నుంచి 49 తులాల బంగారం, 6.8 కిలోల వెండి, రూ. 2.43 లక్షల నగదు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ



నిందితులతో పాటు చోరీ సొత్తును చూపిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ :

కొన్నాళ్ల కిందట జలుమూరు మండలం నగరికటకం గ్రామానికి సమీపంలోని నదిలో ఓ బీరువా కొట్టుకుపోతూ స్థానికులకు కనిపించింది. వాన లేదు, వరద లేదు, ఏ ఇల్లూ కూలలేదు. బీరువా ఎలా నదిలోకి వచ్చిందబ్బా అని వారు ఆశ్చర్యపోయారు. జలుమూరు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి ఆరా తీశారు. విచారణలో తెలిసిన విషయం ఏమిటంటే అది దొంగలు పడేసిన బీరువా. బీరువాలు విరగ్గొట్టే దొంగల గురించి విన్న జనాలకు బీరువాలను నదిలో పడేసే దొంగల గురించి ఆ రోజే తెలిసింది. ఆ దొంగల పేర్లు కుప్పిలి రాజు(44) అలియాస్ బ్లేడుగాడు, కుప్పిలి నర్సింగరావు (54). వీరిది విజయనగరం జిల్లా సంతకవిటి మండలం. 68 కేసుల్లో నిందితులుగా ఉన్న వీరిద్దరినీ శ్రీకాకుళం సీసీఎస్, ఆమదాలవలస పోలీసులు పట్టుకున్నారు. కళ్లలోకి కారం కొట్టడం, బ్లేడు గొంతు మీద పెట్టుకుని బెదిరించడం వీరిద్దరికీ అలవాటు. వీరిని పట్టుకోవడంతో దొంగతనాల కేసులు క్లియర్ అవుతాయని పోలీసులు భావిస్తున్నారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. నిందితుల నుంచి రూ. 49.25 లక్షల విలువైన 574 గ్రాముల బంగారు ఆభరణాలు, 6.8 కిలోల వెండి, రూ. 2.43 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. వివరాల్లోకి వెళితే..

నదిలో బీరువా పడేసి..

నిందితులు ఇద్దరూ గ్రూపుగా ఏర్పడి ఒంటరి ఇళ్లను ఎంచుకుంటారు. ఇంటిలో ఎవరూ లేని సమయంలో తాళాలు పగులగొట్టి బీరువా తెరిచి సొత్తు కాజేస్తారు. ఇదే విధంగా జలుమూరు మండలంలోని నగరికటకం గ్రామానికి అరకిలోమీటరు దూరంలో నది పక్కన ఉన్న ఒంటరి ఇంటిను ఎంచుకుని బీరువాను దొంగిలించారు. ఎంతకీ తాళాలు ఓపెన్ కాకపోవడంతో చిరాకొచ్చి బీరువాను బయటకు తెచ్చి నదిలో పడేశారు. గ్రామస్తులు నదిలో కొట్టుకొచ్చిన బీరువాను చూసి జలుమూరు పోలీసులకు సమాచారమివ్వడంతో అసలు విషయం బయటకు వచ్చింది. నిద్రిస్తున్న మహిళల మెడలో గొలుసులు తెంపేసి పారిపోవడంలో సిద్ధహస్తులు ఈ చోరులు.

బెదిరించేస్తారు..

నిందితుల్లో ఒకడైన కుప్పిలి రాజుకు మరో పేరు బ్లేడ్‌గాడు. అంటే బ్లేడు పెట్టి బెదిరించి దొంగతనాలు చేస్తాడుకునేరు. పోలీసులు పట్టుకోవడానికి వెళ్తే బ్లేడ్ తన మెడపై పెట్టుకుని చనిపోతానని బెదిరించడం ఇతడి ప్రత్యేకత. అతని తల్లి, భార్య, పిల్లలు కూడా అలానే చనిపోతామని బెదిరించడంతో పోలీసులు చాలాసార్లు కంగు తిన్నారు.

రెండు గ్యాంగులతో చోరీలు

వీరికి రెండు గ్యాంగులు ఉన్నాయి. ఈ రెండు గ్యాంగుల్లో కుప్పిలి రాజు, నర్సింగ్‌లే కాక పోలీసుల విచారణలో నిందితులుగా గుర్తించి ఇంకా పట్టుబడని పిన్నింటి సంతోష్, రాగోలు రాంబాబులు ఉన్నారు. నలుగురు సభ్యులు ఉన్న ఈ రెండు గ్యాంగుల్లో కుప్పిలి రాజు, రాగోలు రాంబాబు కామన్‌గా ఉంటారు. వీరు సంతకవిటి మండలంలోని పుల్లి, తాలాడ, అదపాకలోని మామిడి తోటల్లో ఉంటారు. పోలీసులు ఎవరెళ్లినా కళ్లల్లో ఇసుక, కారం కొట్టడం వంటివి చేస్తుంటారు.

పట్టుకున్నారిలా..

ఆమదాలవలస ఎస్ఐ బాలరాజుకు వచ్చిన సమాచారంతో సిబ్బందితో పార్వతీపురం జంక్షన్‌కు శనివారం వెళ్లారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరినీ పట్టుకుని విచారించగా నిజాలు అన్నీ బయటకు వచ్చాయి. 2022 నుంచి 26 కేసుల్లో 15 కేసులు అరెస్టు పెండింగ్ అని ఎస్పీ తెలిపారు. కేసును డీఎస్పీ సీహెచ్ వివేకానంద ఆధ్వర్యంలోని సీసీఎస్ సీఐ సూర్యచంద్రమౌళి, ఆమదాలవలస సీఐ పి.సత్యనారాయణలు తమ సిబ్బందితో చాకచక్యంగా ఛేదించారని ఎస్ఐలు మధుసూదనరావు, బాలరాజు, సిబ్బంది శ్రీనివాస్, నక్క విజయ్‌కుమార్, హరికృష్ణరాజు, రాధాకృష్ణ, శ్యామ్‌సుందర్, సుధీర్‌లను ఎస్పీ అభినందించారు.

సంబరాల సమయం

- పాతపట్నంలో 22 నుంచి దసరా ఉత్సవాలు
- ముస్తాబైన నీలమణి దుర్గ ఆలయం





నీలమణిదుర్గ అమ్మవారి ఆలయం (ఇన్‌సెట్లో) ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం నీలమణి దుర్గ అమ్మవారు

పాతపట్నం:

నీలమణి దుర్గ ఆలయ సన్నిధిలో సంబరాలకు సమయం ఆసన్నమైంది. అమ్మవారిని జిల్లా వాసులతో పాటు, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన భక్తులు పూజిస్తారు. ఆలయానికి దాదాపు 350 ఏళ్ల చరిత్ర ఉంది. అప్పట్లో ఈ పాంతం దట్టమైన అటవీ ప్రాంతంగా ఉండేది. ఒడిశా పర్లాకిమిడిలో ఉన్న మహారాజులు పరిపాలన కోసం ఈ ప్రాంతం నుంచి టెక్కలిలో ఉన్న కోటకు వెళ్లేవారని ప్రతీతి. 1674 సంవత్సరం ప్రాంతంలో పర్లాకిమిడిని పరిపాలిస్తున్న గజపతి మహారాజుకు చెందిన కూలీలు పొలం దున్నుతుండగా నాగలికి విగ్రహం తగిలి బయటపడిందని, రాజుకు అమ్మవారు కలలో కనిపించగా ఇక్కడ ప్రతిష్ఠించారనేది స్థల పురాణం.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ప్రతి రోజూ అమ్మవారు రోజుకో అవతారంలో కనిపిస్తారు. ప్రతి రోజు ఉదయం 8 గంటలకు కుంకుమపూజ, కలశపూజ, అష్టోత్తర శతనామపూజలు జరుగుతాయని, సాయంత్రం 3 గంటలకు సహస్ర నామపూజ, కుంకుమ పూజ ఉంటాయని ఆలయ కార్యనిర్వాహణ అధికారి టి.వాసుదేవరావు తెలిపారు.

దసరా రోజు వాహనాలకు ప్రత్యేక పూజలు

అమ్మవారి గుడి ప్రాంగణంలో కొత్తగా కొనుగోలు చేసిన రకరకాల వాహనాలతో పాటు, ఇతర వాహనాలకు దసరా రోజు ప్రత్యేక పూజలను నిర్వహిస్తామని, 22న బాలత్రిపుర సుందరిదేవిగా, 23న గాయత్రి దేవి, 24న అన్నపూర్ణదేవి, 25 కాత్యాయని దేవి, 26న మహాలక్ష్మి దేవి, 27న లలిత త్రిపుర సుందరి దేవి, 28న మహాచండి దేవి, 29న సరస్వతి దేవి (మూలనక్షత్రం), 30న దుర్గాదేవి (దుర్గాష్టమి), అక్టోబర్ 1వ తేదీన మహిషాసురమర్ధని, 2న రాజరాజేశ్వరిగా అలంకరణ ఉంటుందని తెలిపారు.

ఉత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు

22వ తేదీన సాయంత్రం రాగ సుధా మ్యూజికల్ ఆర్కెస్ట్రా, 23న భక్తి సంగీత విభావరి, అన్నమయ్య కీర్తనలు, 24న రాత్రి 6గంటలకు సినీ భక్తి సంగీత విభావరి, 25న సాయంత్రం భక్తి సంగీత విభావరి, 26న భరత నాట్యం, కూచిపూడి నృత్య విభావరి, 27న శ్రీ సప్తగిరి సంగీత విభావరి, 28న రాత్రి 6 గంటలకు నరసన్నపేట వారి శ్రీ సీతారామ కల్యాణం బుర్రకథ, 29న సాయంత్రం భక్తి సినీ సంగీత విభావరి, 30న రాత్రి 8 గంటలకు విజయనగరం వారిచే రేలారే రేలా, అక్టోబర్ 2న సాయంత్రం 5.30గంటలకు అమ్మవారి తిరువీధి, బాణాసంచా, కాళికవేషాలు, మేళతాళాలతో నిర్వహించనున్నారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు



పాతపట్నం నీలమణి దుర్గ దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహించడానికి దేవదాయశాఖ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. పాతపట్నం సీఐ ఎస్.సన్యాసినాయుడు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు కోసం పాతపట్నం, మెళియాపుట్టి పోలీస్ స్టేషన్ల నుంచి పోలీసులు విధులు అందించనున్నారు.

– టి.వాసుదేవరావు, కార్యనిర్వాహణాధికారి, పాతపట్నం

కొత్తమ్మతల్లి జాతరకు సర్వం సిద్ధం

శ్రీకాకుళం పాతబస్టాండ్: కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి జాతరను 23, 24, 25 తేదీల్లో అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. శనివారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన, జాతర సమయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా సమగ్ర చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతరకు భద్రతా పరమైన చర్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, సీసీ కెమెరాలు, డ్రోన్లతో పర్యవేక్షణ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. జాతర సందర్భంగా కొత్తపేట నుంచి కోటబొమ్మాళి వరకు రహదారి ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్, సెంటర్ డివైడర్ అలంకరణ, విద్యుద్దీపాలు అమర్చినట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం బయో టాయిలెట్లు, ఆర్టీసీ బస్సులు, వైద్య శిబిరాలు, అన్నదానం, మజ్జిగ పంపిణీ, శోభా యాత్ర వంటి ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. సమావేశంలో అయా శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.



కొత్తమ్మ తల్లి జాతరపై సమీక్షిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీలు వాయిదా

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలో ఈనెల 21వ తేదీ నుంచి 23వ తేదీ మధ్యన జరగాల్సిన జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీలు వాయిదా పడ్డాయి. రాష్ట్రప్రభుత్వం దసరా సెలవులను ప్రకటించిన నేపథ్యంలో వివిధ క్రీడాంశాలలో జరగాల్సిన జిల్లా స్థాయి ఎంపికలను వాయిదా వేస్తున్నట్టు జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు, డీఈఓ ఎ.రవిబాబు, కార్యదర్శి బీవీ రమణ తెలిపారు. తదుపరి తేదీలను త్వరలో ప్రకటిస్తామని వెల్లడిస్తామన్నారు. ఈ విషయాన్ని జిల్లాలోని అన్నియాజమాన్య పాఠశాలల హెచ్‌ఎంలు, పీడీలు, కాలేజీల ప్రిన్సిపాళ్లు, పీఈటీలు గుర్తించాలన్నారు.

‘నిరసన కొనసాగిస్తాం’



నిరాహార దీక్ష చేపడుతున్న ఉద్యోగులు

అరసవల్లి: న్యాయమైన తమ డిమాండ్లను పరిష్కరించాలని, ఈ మేరకు యాజమాన్యం స్పందించి నిర్ణయం తీసుకోకపోతే తమ జేఏసీ తరఫున నిరసన కొనసాగిస్తామని విద్యుత్ ఉద్యోగ కార్మికులంతా స్పష్టం చేశారు. శనివారం కూడా విద్యుత్ సర్కిల్ కార్యాలయం ఎదుట విద్యుత్ ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులంతా దీక్ష చేపట్టారు. అయితే ప్రత్యేకంగా మహిళా ఉద్యోగులు పాల్గొనడం చర్చనీయాంశమైంది. తమ నిరసన కొనసాగుతూనే ఉంటుందని దీక్షలో కూర్చున్న మహిళా ఉద్యోగులు ప్రకటించడంపై సర్వత్రా హర్షధ్వానాలు వ్యక్తమయ్యాయి. 22న విద్యుత్ సర్కిల్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపడతామని తెలిపారు.

జర్నలిస్టులపై కేసులు సిగ్గుచేటు

కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ఎత్తి చూపిస్తున్న సాక్షిపై కక్ష కట్టి కేసులు బనాయిస్తే నిజాలు దాగిపోతాయనుకోవడం మీ భ్రమ. ప్రజాస్వామ్య దేశంలో ఫోర్త్ ఎస్టేట్‌గా భావించే జర్నలిజంపై దాడి చేయడం సరికాదు. పత్రికా స్వేచ్ఛను హరించే చర్యలు ప్రభుత్వానికి తగదు.

– పిట్ట దామోదరరావు, వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి




అక్షరమే ఆయుధం

రాక్షస పాలన ప్రశ్నించకూడదా?

రాష్ట్రంలో రాజ్యాంగబద్ధమైన పాలన చేయకుండా కూటమి నేతల అరాచకాలు రోజు రోజుకూ ఎక్కువైపోతున్నాయి. కూటమి నేతల ఆగడాలను ప్రజలకు తెలియజేసే ప్రయత్నం చేస్తున్న సాక్షి దినపత్రిక ఎడిటర్‌పై కేసులు పెట్టి భయపెట్టాలనుకోవడం తగదు.

– ఎన్ని ధనుంజయరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి



క్లుప్తంగా

తల్లీబిడ్డకు ప్రాణంపోశారు



పాపకు జన్మనిచ్చిన సవర రుక్మిణి

టెక్కలి/మందస: పురిటి నొప్పులతో బాధపడుతున్న గిరిజన గర్భిణికి ప్రసవం చేసి తల్లీబిడ్డలకు 108 సిబ్బంది ప్రాణం పోశారు. మందస మండలం బంసుగాం గ్రామానికి చెందిన సవర రుక్మిణి పురిటి నొప్పులతో బాధపడుతుండడంతో కుటుంబ సభ్యులు పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు రిఫర్ చేశారు. శనివారం వేకువజామున 108 వాహనంలో గర్భిణిని తరలిస్తుండగా కోటబొమ్మాళి సమీపంలో పురిటి నొప్పులు అధికం కావడంతో 108 ఈఎంటీ దేవాది శ్రీనివాసరావు, పైలట్ మూగి దుర్గారావు తదితరులు వైద్య సేవలు అందజేసి ప్రసవం చేశారు. రుక్మిణి పాపకు జన్మనిచ్చింది. అయితే పాపలో చలనం లేకపోవడంతో సీపీఆర్ చేశారు. దీంతో చిన్నారి ఊపిరితీసుకోవడం ప్రారంభించింది. అనంతరం కోటబొమ్మాళి సామాజిక ఆసుపత్రిలో చేర్పించారు. 108 సిబ్బంది చేసిన సేవలకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

గాలికుంటు నివారణకు చర్యలు

నరసన్నపేట: జిల్లా వ్యాప్తంగా పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని పశు సంవర్ధకశాఖ జేడీ రాజగోపాల్ అన్నారు. ఉర్లాం పశువైద్య కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 3.30 లక్షల పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నామని చెప్పారు. ప్రతి ఆరు నెలలకు నిర్వహించే ఈ టీకాల కార్యక్రమాన్ని రెండు రోజుల క్రితం జిల్లాలో ప్రారంభించామని, ఇప్పటి వరకూ 20 వేల పశువులకు టీకాలు వేశామన్నారు. ఆస్పత్రుల వారీగా పశువులకు టీకాలు వేస్తున్నామని చెప్పారు. ఉర్లాం పశు వైద్య కేంద్ర భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన భవనం నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈయన వెంట డీడీ బి.గణపతిరావు ఉన్నారు.

జాతీయ బాడీబిల్డింగ్ పోటీలకు లక్ష్మునాయుడు



రెడ్డి లక్ష్మునాయుడును అభినందిస్తున్న ట్రిపుల్ ఐటీ అధికారులు

ఎచ్చెర్ల : జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలకు ఎంపికైన స్థానిక రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ఆంగ్ల ఉపాధ్యాయుడు డాక్టర్ రెడ్డి లక్ష్మునాయుడును ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కె.వి.జి.డి.బాలాజీ శనివారం అభినందించారు. చండీగఢ్‌లో డిసెంబర్ 14, 15న జరిగే జాతీయ స్థాయి పోటీల్లోనూ విజయం సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు లక్ష్మునాయుడును ఆదర్శంగా తీసుకుని ఫిట్‌నెస్ సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌వో ముని రామకృష్ణ, అకడమిక్స్ డీన్ శివరామకృష్ణ, డాక్టర్ వాసు, గేదెల రవి, గణేష్, సాగర్, సూకేశ్వరరావు, రాకోటి శ్రీనివాసరావు, సాయిరాజు, పీఆర్‌వో మామిడి షణ్ముఖరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మూడు పూరిళ్లు దగ్ధం




వివరాలు సేకరిస్తున్న పంచాయతీ, అగ్నిమాపక సిబ్బంది

జి.సిగడాం: జాడ గ్రామంలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు పూరిళ్లు కాలిపోయాయి. గ్రామానికి చెందిన చల్లా అప్పయ్యమ్మ, చల్లా ఆదినారాయణ, పులపా నర్సింహులు కుటుంబాలు కట్టుబట్టలతో మిగిలాయి. విలువైన సామగ్రి, తిండి గింజలు పూర్తి కాలి బూడిదయ్యాయి. సుమారు రూ. 4లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోతున్నారు. సమాచారం అందుకున్న రాజాం అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. పంచాయతీ కార్యదర్శి జాడ వెంకటన్నాయుడు, వీఆర్‌ఓ సంతోష్ కాలిపోయిన ఇళ్లను పరిశీలించారు.

తెలుగు తమ్ముళ్ల కుమ్ములాట

గార: తెలుగుదేశం పార్టీలో అంతర్గత కలహాలు బయటపడ్డాయి. గార మండం కె.సైరిగాం పంచాయతీలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఎమ్మెల్యే నిర్వహించిన సమావేశంలో ఒకరిపై ఒకరు చేయిచేసుకున్నారు. శనివారం శ్రీకూర్మంలోని ఓ ప్రైవేటు కల్యాణ మంటపంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఆధ్వర్యంలో 'క్యాడర్ తో లీడర్' కార్యక్రమంలో భాగంగా ఏడు పంచాయతీల క్యాడర్‌తో వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. కె.సైరిగాం పంచాయతీ కార్యకర్తల సమావేశంలో సార్వత్రిక ఎన్నికల్లో పార్టీలో ముందు నుంచి ఉన్న నాయకులు, తర్వాత చేరిన నాయకుల మధ్య మాటల యుద్ధం జరిగి ఒకరిపై ఒకరు చేయిచేసుకున్నారు. ఎమ్మెల్యే వారించే ప్రయత్నం చేసినా నాయకులు తగ్గకపోవడం గమనార్హం.

బకాయిల భారం భరించలేం!



ప్రైవేటు డిగ్రీ కళాశాలలో విద్యార్థులు

- రేపటి నుంచి మూతపడనున్న ప్రైవేటు డిగ్రీ కాలేజీలు
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రభుత్వ తీరుకు నిరసనగా తరగతుల బంద్

శ్రీకాకుళం న్యూకాలనీ: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా ప్రభుత్వం వ్యవహరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా సోమవారం నుంచి ప్రైవేటు డిగ్రీ కళాశాలలు మూతపడనున్నాయి. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే పాఠశాల విద్యను గాలికొదిలేసింది. ఇంటర్మీడియెట్ విద్యను పెద్దగా పట్టించుకున్నదాఖలాలు కనిపించడంలేదు. ఇక డిగ్రీ కాలేజీ విద్యపై ప్రత్యేకంగా చెప్పనవసరంలేదు. మొన్నటి వరకు డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించి నోటిఫికేషన్‌ను సైతం వెలువరించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉంది. ఇక 2024లో అధికారంలోకి వచ్చిన తర్వాత డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, ఫార్మసీ, ఐటీఐ, పాలిటెక్నిక్ ఇతర వృత్తివిద్య కోర్సులను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించలేదు. గత 16 నెలలుగా సీఎంను, డిప్యూటీ సీఎం, విద్యాశాఖామంత్రును పలుమార్లు కలిసినా అతీగతీ లేదని సంఘ నాయకులు వాపోతున్నారు.

నిర్వహణ భారం భరించలేక..

విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయలేక, ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు రాక కాలేజీల నిర్వహణ భారంగా మారింది. భవనం అద్దెలు, అధ్యాపకుల జీతాలు, కరెంట్‌బిల్లులు, అఫ్లియేషన్ ఫీజులు, కళాశాలల రోజువారి నిర్వహణ తలకు మించిన భారంగా మారడంతో ప్రైవేటు కాలేజీల మేనేజ్‌మెంట్లు తీవ్ర ఒత్తిడిలో ఉన్నాయి. దీంతో రాష్ట్రంలోని ఏపీ ప్రైవేట్ డిగ్రీ కాలేజ్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. విద్యార్థులను భయపెట్టి, బాధపెట్టి సాధించిందేమీలేదని భావించి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ప్రభుత్వం స్పందించే వరకు కాలేజీల్లో తరగతులు రద్దు చేయాలని నిర్ణయించింది. ఈనెల 14న రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశంలో తీసుకున్న ఏకగ్రీవ తీర్మానం మేరకు ఈ నెల 22 నుంచి ప్రైవేటు డిగ్రీ కాలేజీలు మూడపడనున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ పరిధిలో శ్రీకాకుళం జిల్లాలోని అన్ని ప్రైవేటు డిగ్రీ కాలేజీలను మూసివేస్తామని సంఘ నాయకులు స్పష్టంచేస్తున్నారు.

రూ.80 కోట్లు పెండింగ్..

జిల్లాలో అన్ని యాజమాన్యాల పరిధిలో 100 డిగ్రీ కాలేజీలు ఉన్నాయి. వీటిలో 16 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు మినహా మిగిలిన 84 ప్రైవేటు కాలేజీలే. వీటిల్లో ఫంక్షనింగ్ జరుగుతూ.. అడ్మిషన్లు జరుపుతున్న కాలేజీలు 76 వరకు ఉన్నాయి. వీటిలో 30 వేలు మంది వరకు చదువుతున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు 2024–25 విద్యా సంవత్సరానికి గాను అకడమిక్ ఇయర్ బ్యాచ్‌కు రూ.45 కోట్లు, అంతకుముందు మూడు క్వార్టర్ల పెండింగ్ మరో రూ.35 కోట్లు కలిపి రూ.80 కోట్ల మేర ఒక్క డిగ్రీ విద్యకే పెండింగ్ ఉన్నట్టు ఏపీ ప్రైవేటు డిగ్రీ కాలేజీల మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ నాయకులు చెబుతున్నారు.

నిధులు విడుదల చేయాలి..



ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ నిధుల విషయమై ప్రభుత్వ పెద్దలు, ప్రజాప్రతినిధులను ఎన్నిసార్లు కలిసిన ఉపయోగం లేకపోయింది. విద్యార్థులను ఫీజులు చెల్లించమని ఒత్తిడి చేయలేక, ప్రభుత్వం నిధులు విదల్చక కాలేజీల నిర్వహణభారం కష్టంగా మారింది. గత్యంతరం లేని పరిస్థితుల్లో రాష్ట్రంతోపాటు శ్రీకాకుళం జిల్లాలోను ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో క్లాసులను నిర్వహించకూడదని నిర్ణయించాం. ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని బకాయి నిధులు విడుదలకు చర్యలు తీసుకోవాలి.

– పొన్నాన జయరాం, ఏపీ ప్రైవేటు డిగ్రీ కాలేజ్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

దస్తావేజు లేఖర్ల సమస్యలు పరిష్కరించాలి

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): గత ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన 2.0 ప్రైమ్ కార్డు విధానంలో సక్రమంగా విధులు నిర్వహిస్తున్నప్పటికి కూటమి ప్రభుత్వం కొత్త విధానం తీసుకొచ్చిందని, ఓటీపీలు పలుమార్లు రావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని, ఈ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని దస్తావేజు లేఖర్లు, స్టాంప్ వెండర్లు కోరారు. ఈ మేరకు పెన్‌డౌన్‌లో భాగంగా జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కక్షిదారులకు, స్టాంప్ వెండర్లకు, దస్తావేజు లేఖరులకు న్యాయం చేయాలని, సజావుగా సులభతరమైన రిజిస్ట్రేషన్ ప్రక్రియ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కింతలి రమణారావు, శ్రీనివాస పాత్రో, దామోదర మెహర్, కె.దుర్గాప్రసాద్, తాళ్లవలస కుమారస్వామి, తొగరాం భువనమోహన్, చింతనిప్పుల అప్పలరాజు, అన్నెపు సీతారాం, అల్లు రాజారావు, బలగ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సబ్‌రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందిస్తున్న డాక్యుమెంట్ రైటర్లు, స్టాంప్‌వెండర్లు

కళాశాలల్లో ఆకస్మిక తనిఖీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు సమిష్టిగా పని చేయాలని ఇంటర్మీడియెట్ విద్య జిల్లా వృత్తివిద్యాశాఖాధికారి రేగ సురేష్‌కుమార్ అన్నారు. మూడు వారాలుగా జిల్లాలోని రణస్థలం, జలుమూరు, నరసన్నపేట, నివగాం, ఆమదాలవలస, కొత్తూరు, హిరమండలం, కళింగపట్నం తదితర కళాశాలల్లో ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకుంటున్నారు. శనివారం కొయ్యాం ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీచేశారు. క్వార్టర్లీ పరీక్షలు రాస్తున్న విద్యార్థుల వద్దకు వెళ్లి జవాబుపత్రాలను పరిశీలించారు. అంతకుముందు కళాశాలకు చెందిన సైన్స్ ల్యాబ్, నాడు–నేడు పనులపై ఆరా తీశారు.

సకాలంలో సిలబస్ పూర్తిచేయాలి..

అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ కీర్తి తవిటినాయుడు, లెక్చరర్లతో సమావేశం నిర్వహించారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సిలబస్ సకాలంలో పూర్తిచేయాలని, ముఖహాజరు తప్పనిసరిగా నమోదు చేయాలని, శతశాతం విద్యార్థులకు కాలేజీలకు వచ్చేలా చొరవ తీసుకోవాలని, తరచూ విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడాలని, అవసరమైతే పిల్లల ఇళ్లకు వెళ్తుండాలని సూచించారు. అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి ప్రిన్సిపాల్‌తో కలిపి డీవీఈఓ స్వయంగా వడ్డించారు. కళాశాలలో వసతులు, సాక ర్యాలు, విద్యాప్రమాణాలు, సిబ్బంది పనితీరుపట్ల సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో కళాశాల ఏజీఎంసీ సనపల షణ్ముఖరావు, ఎస్.ధర్మారావు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న డీవీఈఓ, ప్రిన్సిపాల్

సమగ్ర శిక్షలో నిబంధనలకు తూట్లు!

శ్రీకాకుళం: రాష్ట్ర సమగ్ర శిక్ష అధికారులు నిబంధనలను పాటించకుండా ఇష్టానుసారంగా నియామకాలు చేపడుతున్నారని ఉపాధ్యాయ వర్గాలు ఉదహరిస్తున్నాయి. జిల్లాలో జీసీడీఓ పోస్టు ఐదు నెలలుగా ఖాళీగా ఉంది. దీనికోసం జిల్లాలోని అనేకమంది మహిళా ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. అయినా జిల్లా సమగ్ర శిక్ష అధికారులు పోస్టును భర్తీ చేయలేదు. కాగా నెల రోజుల క్రితం తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఎస్‌జీటీ స్థాయి ఉపాధ్యాయురాలిని అసిస్టెంట్ జీసీడీఓగా నియమించారు. వాస్తవానికి శ్రీకాకుళం జిల్లాలోని సమగ్ర శిక్ష ప్రాజెక్టుకు అసిస్టెంట్ జీసీడీఓ అనే పోస్టు లేనేలేదు. అయినప్పటికీ ఆ పోస్టులో ఉపాధ్యాయురాలిని, అది కూడా ఇతర జిల్లాకు చెందిన వ్యక్తిని నియమించడం పూర్తి విరుద్ధమనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా, ఈ నియామకం రాష్ట్ర స్థాయి నుంచి జరగడంతో జిల్లా అధికారులు ఆమెను విధుల్లో చేర్చుకున్నట్లు సమాచారం.

కోర్టు ఆవరణలో న్యూసెన్స్

- మందుబాబుకు 45 రోజుల జైలు శిక్ష

శ్రీకాకుళం క్రైమ్ : మద్యం సేవించి జిల్లా కోర్టు వద్ద న్యూసెన్సు సృష్టించిన వ్యక్తికి 45 రోజుల జైలు శిక్ష న్యాయస్థానం విధించింది. రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. పొందూరు మండలం వావిళ్లపేట గ్రామానికి చెందిన కోరుకోల దుర్వాసులు (58) ఈ నెల 19న మధ్యాహ్నం కోర్టు ఆవరణలో తాగి న్యూసెన్సు చేశాడు. వెంటనే పోలీసులు బ్రీత్ అనలైజర్ ద్వారా చెక్‌చేయగా తాగినట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో శనివారం సెకెండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ శివరాం వద్ద పోలీసులు హాజరుపర్చగా 45 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారని సీఐ వెల్లడించారు.

దసరా సెలవుల్లోనే డీఎస్సీ కౌన్సెలింగ్ నిర్వహించాలి

శ్రీకాకుళం: రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ–2025 అభ్యర్థులకు దసరా సెలవుల్లోనే కౌన్సెలింగ్ నిర్వహించాలని డీటీఎఫ్ నాయకులు పేడాడ కృష్ణారావు, పూజారి హరిప్రసన్న శనివారం డిమాండ్ చేశారు. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే రోజున విధుల్లో చేరేలా నియామక ఉత్తర్వులు అందజేయాలని కోరారు. ఎన్నడూ లేని విధంగా రాష్ట్రస్థాయిలో డీఎస్సీ అభ్యర్థులకు అమరావతిలో నియామక పత్రాలు అందజేయాలని యోచించడం సరైన విధానం కాదన్నారు. ఇటువంటి చర్యల వల్ల మహిళా అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతారని చెప్పారు. ఈ నెల 17న అమరావతికి తీసుకువెళ్తామని బస్సులు సిద్ధం చేసి, అవి బయలుదేరే ఐదు నిమిషాలు ముందు కార్యక్రమం వాయిదా వేసినట్లు ప్రకటించడంతో అభ్యర్థులంతా ఎన్నో ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. భవిష్యత్తులో ఇటువంటి అనాలోచిత చర్యలు పునరావృతం కాకుండా జిల్లా స్థాయిలోనే కౌన్సెలింగ్ నిర్వహించి నియామక ఉత్తర్వులు అందజేయాలన్నారు. గతంలో బదిలీ అయ్యి రిలీజ్ కానీ ఉపాధ్యాయులకు కూడా మార్గం సుగమం చేసి వారు రిలీవ్ అయ్యేలా చూడాలని కోరారు. ఈ ప్రక్రియ అంతా దసరా సెలవులు లోగానే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

అంత్యోదయ కార్డులో అక్రమాలు

- గిరిజనుడి రేషన్‌కార్డులో చేరి బియ్యం బుక్కేస్తున్న తెలుగుదేశం నేత
- లబోదిబోమంటున్న బాధితుడు



మోసపోయిన గిరిజనుడు సవర మన్మధరావు



ఇటీవల వచ్చిన స్మార్ట్ రైస్‌కార్డు

నందిగాం: తెలుగుదేశం నాయకులు చేస్తున్న అక్రమాలు రోజుకొకటి బయటకు వస్తున్నాయి. నిరుపేదలకు ఇచ్చే అంత్యోదయ రేషన్ కార్డులో అక్రమంగా తన పేరు చేర్చి ఆ కార్డుకు వచ్చే బియ్యాన్ని బుక్కేస్తున్న తెలుగుదేశం నాయకుడి లీలలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. నందిగాం మండలం హర్షబడ పంచాయతీ ముకుందాపురం గ్రామానికి చెందిన సవర మన్మధరావు అనే గిరిజనుడికి వైఏపీ 013064000173 నంబర్‌తో నిరుపేదలకు ఇచ్చే అంత్యోదయ రేషన్ కార్డు, 2801209354 నంబరుతో రైస్ కార్డు ఉండేది. దీని ద్వారా ప్రతి నెలా అందే 35 కిలోల బియ్యంతో కుటుంబం నెట్టుకొచ్చేది. 2017లో మన్మధరావు ఉపాధి కోసం చెన్నై వలస వెళ్లి అక్కడ నాలుగు నెలలు పని చేసి మరలా గ్రామానికి వచ్చాడు. రేషన్ కోసం డీలర్‌ను సంప్రదిస్తే కార్డు పరిధి మారిపోయిందని చెప్పడంతో బడగాం డీలర్‌ను సంప్రదించాడు. ఆ నంబరు కార్డులో బడగాం పంచాయతీ గనియాపేటకు చెందిన తెలుగుదేశం నాయకుడు గరుడాచలం తులసీదాస్ చేరి ఉన్నాడనే విషయం తెలిసింది. దీంతో తులసీదాస్ ఇంటికి వెళ్లి అంత్యోదయ కార్డులో తన ప్రమేయం లేకుండా చేరడం, డిపో మార్చడంపై నిలదీశాడు. అంతా నా ఇష్టమని, దిక్కున్న చోట చెప్పుకో అంటూ మన్మధరావును వెళ్లగొట్టాడు. ఎన్నిసార్లు అడుగుతున్నా కార్డు ఇవ్వకుండా బెదిరిస్తుండటంతో శనివారం నందిగాం డిప్యూటీ తహసీల్దారు శంకరరావుకు ఫిర్యాదు చేశాడు. పరిశీలించి న్యాయం చేస్తామని డీటీ హామీ ఇచ్చారు. కాగా, ఇటీవల ప్రభుత్వం పంపిణీ చేసిన స్మార్ట్ రైస్ కార్డులో కుటుంబపెద్దగా గరుడాచలం తులసీదాస్ ఉంటూ కుటుంబ సభ్యునిగా సవర మన్మధరావు పేరు ఉండటం గమనార్హం.

పాత నేరస్థులపై నిఘా

శ్రీకాకుళం క్రైమ్ : హోంగార్డు స్థాయి నుంచి డీఎస్పీ వరకు తప్పనిసరిగా గ్రామాలను సందర్శించి తగాదాలకు దారి తీసే పరిస్థితులపై దృష్టి పెట్టి కారణమైన వ్యక్తులను గుర్తించి బైండోవర్ చేయాలని, పాత నేరస్థులపై నిరంతర నిఘా పెట్టాలని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో అధికారులతో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గ్రేవ్ కేసులు, మహిళలపై దాడులు, ఈవ్ టీజింగ్, పోక్సో, హెరాస్మెంట్, బాల్య వివాహాలు, సైబర్ నేరాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. అదనపు ఎస్పీ కె.వి.రమణ, పి.శ్రీనివాసరావు, డీఎస్పీలు వివేకానంద, లక్ష్మణరావు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

బంగారం వ్యాపారంపై నిఘా

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో బంగారం వ్యాపారంపై నిఘా ఉంచామని, ఇప్పటికే సంబంధిత విభాగాలను సమన్వయం చేసుకుని ప్రణాళిక రూపొందించామని, అవకతవకలపై ఫిర్యాదులొస్తే దాడులు చేయడానికి వెనుకాడబోమని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల జిల్లాలో సంచలనం కలిగించిన నరసన్నపేట బంగారం వ్యాపారి హత్యోదంతంపై పై విధంగా స్పందించారు. జీఎస్టీ బిల్లులు ఎగ్గొట్టి వ్యాపారం చేయడం, లాభం వచ్చేటప్పుడు తమతో పాటు కష్టపడేవారిని దూరంగా పెట్టడం, నమ్ముకున్న వ్యక్తులే పగపెంచుకోవడంతో హత్యలకు దారి తీస్తున్నాయన్నారు. ఈ–సిమ్ స్కామ్, డిజిటల్ అరెస్టు, పార్ట్‌టైం ఫ్రాడ్ వంటి సైబర్ నేరాలు జరుగుతున్న మాట వాస్తవమేనని, ఫిర్యాదులివ్వడానికి ప్రజలు ముందుకు రావడం లేదని, అప్రమత్తతతోనే నేరాలు తిప్పికొట్టవచ్చన్నారు.

బీచ్‌ను పరిశుభ్రంగా ఉంచుదాం

శ్రీకాకుళం రూరల్: భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందిద్దామని, సముద్ర తీరాలను పరిశుభ్రంగా ఉంచుదామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ తీరప్రాంత శుభ్రత దినోత్సవం శనివారం నిర్వహించారు. పెదగనగళ్లవానిపేట బీచ్ పరిసర ప్రాంతంలో ఎమ్మెల్యే గొండు శంకర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి చెత్తాచెదారాలను తొలగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బీచ్‌కు వచ్చిన వారు సైతం తమవెంట చిన్నపాటి డస్ట్‌బిన్‌ను తీసుకురావాలన్నారు. స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కింద జిల్లాలో ఇప్పటికే 912 గ్రామాలకు గాను 221 గ్రామాలు ఓడీఎఫ్ ప్లస్ మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దినట్లు తెలిపారు. ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ వ్యర్థాలు సముద్రంలోకి నేరుగా విడిచిపెట్టడం వల్ల నీరు కలుషితమవుతోందన్నారు. మత్స్య సంపదకు తీవ్ర నష్టం వాటిల్లుతున్నట్లు చెప్పారు. అక్టోబర్ 2 నుంచి ప్లాస్టిక్ రహిత శ్రీకాకుళం అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కరుణశ్రీ, డీపీఓ కె.భారతి సౌజన్య, తహశీల్దార్ గణపతిరావు, ఎంపీడీఓ ప్రకాశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.



పెదగనగళ్లవానిపేట బీచ్‌లో పర్యటిస్తున్న కలెక్టర్

వృత్తి వ్యవసాయం.. ప్రవృత్తి సారా వ్యాపారం

శ్రీకాకుళం క్రైమ్ : పలాస ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఓ వివాహిత వద్ద చోరీకి గురైన బంగారాన్ని బొబ్బిలి రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తికి అమ్మేసిన ఒడిశాకు చెందిన బిబిషాన్ పుషీకా అలియాస్ ముత్యాలు (41)ను పలాస బస్టాండు వద్ద పోలీసులకు పట్టుకున్నారు. ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఈ మేరకు శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఒడిశా కొరాపుట్ జిల్లాకు చెందిన పుషీకా ఓ రైతు. కానీ ఒడిశాలో లైసెన్సు సారా బట్టీలు ఉండడంతో ఏటబీలో సారా అమ్ముతుంటాడు. ఈ క్రమంలో 50కు పైగా కేసుల్లో దొంగలుగా ఉన్న పోలా భాస్కర్, ఎచ్చెర్ల మండలానికి చెందిన ముద్దాడ నర్సింగరావుతో అతడికి పరిచయం ఏర్పడింది. వారు దొంగిలించిన బంగారాన్ని అమ్మడానికి ఒప్పందం కుదిరింది. ఈ క్రమంలో కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన చప్పా నీలవేణి ఇంట్లో భాస్కర్, నర్సింగరావు కొంత సొత్తును చోరీ చేసి పుషీకాకు అప్పగించారు. అందులో బొబ్బిలిలో కొంతభాగం అమ్మగా వచ్చిన సొమ్మును కొంత వారికొచ్చి మిగతాది జల్సాలకు పుషీకా వినియోగించాడు. మిగతా బంగారాన్ని శనివారం బరంపురం వెళ్లి అమ్మేందుకు పలాస బస్టాండ్ వద్ద వేచిచూస్తుండగా పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితుని నుంచి 40.60 గ్రాముల బంగారు గాజులు, 11.6 గ్రాముల చైన్, 5.8 గ్రాముల ఉంగరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

మండపాలకు ఉచిత విద్యుత్ బురిడీ

- నేటి నుంచి దసరా నవరాత్రుల మండపాలకు అనుమతులు ప్రారంభం
- దసరా మండపాలకూ ఉచిత విద్యుత్
- గణేశ్ చవితికి 1100 మండపాలు పెడితే 170 మండపాలకే ఉచిత విద్యుత్
- డిస్కంకు ప్రభుత్వం చెల్లించాల్సిన సొమ్ము రూ.7.71 లక్షలు



జిల్లా కేంద్రంలో దసరా నవరాత్రులకు సిద్ధం చేస్తున్న మండపం

అరసవల్లి: జిల్లాలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన మండపాల సంఖ్య 1100పైగానే ఉంటుంది. కానీ మండపాలన్నింటికీ ఉచిత విద్యుత్ అని ప్రకటించిన ప్రభుత్వం.. ఉచితంగా కరెంటు ఇచ్చిన మండపాల సంఖ్య తెలుసా.. కేవలం 170. స్థానిక రాజకీయ సిఫారసులనే అర్హతగా చూసుకున్నారు. దీంతో పాటు ప్రభుత్వానికి 'ఉచిత' భారం పడకుండా తక్కువ సంఖ్యలోనే మండపాల నమోదు సంఖ్య ఉండేలా ముందుగానే జాగ్రత్తపడ్డారు. ఇప్పుడు దసరా మండపాలకూ అదే సూత్రం వర్తించేలా పనిచేస్తున్నారు.

విద్యుత్ శాఖకు రూ.7.71 లక్షల బిల్లులు

వినాయక చవితి సందర్భంగా తొమ్మిది రోజుల పాటు 'అనుమతి' పొందిన మొత్తం 170 మండపాల్లో విద్యుత్ వినియోగ లెక్కలు పరిశీలిస్తే.. మొత్తం శ్రీకాకుళం డివిజన్‌లో 36, పలాస డివిజన్‌లో 78, టెక్కలి డివిజన్‌లో 56 మండపాలనే గుర్తించారు. విద్యుత్ శాఖ లెక్కల ప్రకారం ఈ మొత్తం 170 మండపాల నుంచి రోజుకు 12,240 యూనిట్లు చొప్పున తొమ్మిది రోజులకు గాను మొత్తం 1,10,160 యూనిట్లు విద్యుత్ వినియోగించినట్లుగా గుర్తించారు. ఈ లెక్కన వినియోగ విద్యుత్ బిల్లుగా రూ.7,71,120 వచ్చినట్లుగా లెక్కలు కట్టారు. ఈ మేరకు ఈ ఉచిత భారమంతా తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్ డిస్కం)పై పడనుంది. అయితే ఈ రాయితీని రాష్ట్ర ప్రభుత్వమే డిస్కంకు చెల్లించాల్సి ఉంది.

నేటి నుంచి దసరా మండపాల గుర్తింపు

రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే ప్రకటించిన విధంగా వినాయక చవితితో పాటు దసరా నవరాత్రులకు కూడా మండపాల నిర్వహణకు 'ఉచిత' విద్యుత్ విధానాన్ని అమలు చేయనున్నారు. దేవీశరన్నవరాత్రులు నేటితో ప్రారంభం కానున్న నేపథ్యంలో అనుమతుల కోసం జిల్లాలో అన్ని ప్రాంతాల నుంచి యువకులు, నిర్వాహక ప్రతినిధులు సన్నద్ధమవుతున్నారు. జిల్లాలో 30 మండలాల్లో కనీసంగా 300 నుంచి 500 వరకు దేవీనవరాత్రులను జరిపే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎన్నింటికి ఉచిత విద్యుత్ వస్తుందో వేచి చూడాల్సిందే.

దసరా మండపాలకూ ఉచిత విద్యుత్



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం దసరా నవరాత్రుల నిర్వహణ మండపాలకు కూడా ఉచిత విద్యుత్ అమలు చేయనున్నాం. సంబంధిత ప్రభుత్వ శాఖల అనుమతులు పొందిన మండపాలకు మాత్రమే ఈ రాయితీ ఉంటుంది. వినాయక చవితికి జిల్లాలో 170 మండపాలకు ఉచిత విద్యుత్ రాయితీని అమలు చేశాం.

– నాగిరెడ్డి కృష్ణమూర్తి, ఎస్ఈ, విద్యుత్ శాఖ